క్లుప్తంగా

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



స్టేషనరీని అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ ఓసీ రాజా తదితరులు

జి.మాడుగుల: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సీఆర్‌పీఎఫ్–198 బెటాలియన్ ఓసీ కె.రాజా, ఇన్‌స్పెక్టర్ కె.సీ.దాస్ తెలిపారు. సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గురుకులం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రైటింగ్ మెటీరియల్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, వసతులు వంటి సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, విద్య పట్ల దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు లక్ష్య సాధనతో చదువు పట్ల దృష్టితో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి



జోగులుపుట్టు పాఠశాలను సందర్శించిన ఎంఈవోలు చెల్లయ్య, ఈశ్వరరావు

హుకుంపేట: విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవోలు సోమేలి చెల్లయ్య, ఈశ్వరరావులు చెప్పారు. మండలంలోని జోగులుపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను వారు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మెరుగైన బోధన అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



చెత్తను సేకరిస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలసలో ఈవోపీఆర్‌డీ జె.పాపారావు, పంచాయతీ కార్యదర్శి కె.బాలకృష్ణ ఆధ్వర్యంలో క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించారు. డీపీవో ఆదేశానుసారం ప్రతీ ఇంటి నుంచి శనివారం చెత్త సేకరణ పనులు చేపట్టారు. తడి, పొడి చెత్తను సేకరించి కేటాయించిన డంపింగ్ యార్డుకు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు

వీధిలైట్ల ఏర్పాటు

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము పంచాయతీలోనిగ్రామాల్లో విద్యుత్ వీధిలైట్లు ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ చీడి శివ తెలిపారు. సుబ్బంపాడు, ఎర్రంపాడు గ్రామాలతో పాటు దూసరపాములోని వీధిలైట్లు ఏర్పాటు పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు.విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాంబాబు, ముసలయ్య తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

రంపచోడవరం: రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించకుండా విధుల నుంచి తొలగించడం దారుణమని ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు మట్ల వాణిశ్రీ అన్నారు. ఈ సందర్భంగా ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన తరువాత తమకు వచ్చే ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చకుండా ఉన్నతాధికారులు తమను విధుల నుంచి తొలగిస్తున్నారని, ఇది అన్యాయమన్నారు. దీనిపై ఐటీడీఏ పీవో స్పందించాలని కోరారు. లేకుంటే సమ్మెబాట పడతామన్నారు.

మార్చి 3 నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

అడ్డతీగల: ఓపెన్ ఇంటర్ పరీక్షలు మార్చి 3వ తేదీ నుంచి జరగనున్నట్టు ఎల్లవరం స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ కె.చిన్నిబాబు తెలిపారు. ఇందులో భాగంగా 3న–ఇంగ్లీషు, 5న–హిందీ, తెలుగు, ఉర్దూ పరీక్ష, 7న –రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. 10న భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, పౌర శాస్త్రం, మనో విజ్ఞా శాస్త్రం, 12 న గణితం, చరిత్ర, వ్యాపార గణాంక శాస్త్రం, 15న జీవ శాస్త్రం, వాణిజ్య, వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు ఉంటాయన్నారు. రంపచోడవరం కేంద్రంగా పరీక్షలు జరగనున్నట్టు తెలిపారు.



సబ్ పోస్టాఫీసు కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఐపీవో లక్ష్మీ కిషోర్, సర్పంచ్ సుభాష్‌చంద్ర తదితరులు



ముంచంగిపుట్టులో సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు గుర్తించిన ఇంజినీరింగ్ శాఖ భవనం

ఏళ్ల నాటి కల... నెరవేరుతున్న వేళ

- స్థానికులకు చేరువకానున్న పోస్టల్ సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండలవాసులు
- ముంచంగిపుట్టులో త్వరలో సబ్ పోస్టాఫీసు ఏర్పాటు



ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు సేవలందిస్తున్న పెదబయలు సబ్ పోస్టాఫీస్

ముంచంగిపుట్టు: మండలవాసులకు పోస్టల్ సేవలు మరింత చేరువ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ విస్తరణలో భాగంగా నూతన సబ్ పోస్టాఫీసులు ఏర్పాటులో భాగంగా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో సబ్ పోస్టాఫీసు మంజూరైంది. ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు పెదబయలులో ఉన్న సబ్ పోస్టాఫీసు గత కొన్నేళ్లుగా దిక్కుగా ఉంది. పెదబయలు సబ్ పోస్టాఫీసు మీద ఆధారపడి 48 పంచాయతీలకు సంబంధించి 34 బ్రాంచ్ పోస్టాఫీసులు పనిచేస్తున్నాయి. ముంచంగిపుట్టు మండలం నుంచి రిజిస్టర్ పోస్టులు, స్పీడ్ పోస్టులు, పీఎల్‌ఏలు వంటివి చేసేందుకు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదబయలు వెళ్లాల్సి వచ్చేది. **దీంతో మండలవాసులకు పోస్టల్ సేవలకు దూరమయ్యే పరిస్థితులుండేవి. గత్యంతరం లేక పెదబయలు** వెళ్లి పోస్టల్ సేవలు వినియోగించుకొ**నేవారు.** పలుమార్లు ముంచంగిపుట్టులో సబ్ పోస్టాఫీసు ఏర్పాటు చేయాలని మండల వాసులు ఉన్నతాధికారులను కోరిన సందర్భాలు సైతం అనేకం ఉన్నాయి. ముంచంగిపుట్టు మండలం నుంచి పోస్టాఫీసును వినియోగించుకొని వివిధ రకాల సేవింగ్ ఖాతాలు 26 వేలకు పైగా ఉన్నాయి. దీనికి తోడు ఒక సబ్‌పోస్టాఫీసు మీద 48 పంచాయతీలు ఆధారపడి ఉండడంతో సబ్ పోస్టాఫీసులో విధులు నిర్వహించే సిబ్బందికి పని ఒత్తిడి ఎక్కువగానే ఉండేది.అయితే ఎట్టకేలకు ముంచంగిపుట్టులో సబ్‌పోస్టాఫీసు మంజూరు కావడం మండల వాసులకు పోస్టల్ కష్టాలు తీరడంతో పాటు మరింత చేరువగా సేవలు అందుబాటులోకి వచ్చినట్టు అయిందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు స్థలాల పరిశీలన

ముంచంగిపుట్టులో సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఇంజినీరింగ్ శాఖ, ఆర్అండ్‌బీ శాఖ, మండల పరిషత్ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ భవనాలు, ఖాళీ స్థలాలను పోస్టల్ ఐపీవో లక్ష్మీకిషోర్, సిబ్బంది గుర్తించారు. నివేదికలు పంపారు. ఉన్నతాధికారులు పోస్టాఫీసుకు అనుకూలమైన భవనాన్ని గుర్తించి, అనుమతులు ఇచ్చిన వెంటనే సబ్ పోస్టాఫీసు ఏర్పాటు కానుంది. సబ్ పోస్టాఫీసు మంజూరు కావడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తీరనున్న ప్రధాన సమస్య

మండల కేంద్రంలో సబ్ పోస్టాఫీసు ఏర్పాటు చేస్తే ఇంటర్, పదో తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాలు పోస్టాఫీసు ద్వారా పంపించేందుకు ప్రధాన సమస్య తీరుతుంది. ముంచంగిపుట్టులో సబ్ పోస్టాఫీసు లేకపోవడంతో ఏటా **మండలంలో జరిగే ఇంటర్, పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలు ఇంటర్ బోర్డు, ఎస్ఎస్‌సీ బోర్డు**లకు పోస్ట్ చేసేందుకు పరీక్షలు జరిగే అన్ని రోజులు ప్రత్యేక వాహనం ద్వారా ముంచంగిపుట్టు నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదబయలు పోస్టాఫీసుకు చేరదీయాల్సి వచ్చేది. అక్కడి నుంచి సంబంధిత ప్రధాన కార్యాలయాలకు పంపించాల్సిన పరిస్థితి ఉండేది. నిర్వాహకులు పరీక్షల కాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గతంలో ఈ పరిస్థితిని గుర్తించిన ఇంటర్ బోర్డు అధికారులు ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పెదబయలుకు మార్చడం జరిగింది. పరీక్షలు రాసే ఇంటర్ విద్యార్థులు ఇబ్బందులు పడడంతో ముంచంగిపుట్టులోనే యధావిధిగా పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ముంచంగిపుట్టులో సబ్ పోస్టాఫీసు ఏర్పాటు జరిగితే పెదబయలు వెళ్లే పరిస్థితి నిర్వాహకులకు తప్పుతుందని పలువురు చెబుతున్నారు.

సబ్‌పోస్టాఫీసు ఏర్పాటుకు చర్యలు



ముంచంగిపుట్టు మండల వాసులకు పోస్టల్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ముంచంగిపుట్టులో సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు అవసరమైన భవనాలను పరిశీలించాం. పోస్టాఫీసు కోసం కేటాయించిన స్థలాన్ని సైతం పరిశీలించాం. ఉన్నతాధికారులు వచ్చి భవనాలను పరిశీలించిన అనంతరం సబ్ పోస్టాఫీసు ఏర్పాటు చేయనున్నారు. అందుకు ఇంజినీరింగ్ శాఖ భవనం సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు అనుకూలంగా ఉంది.

– వి.లక్ష్మీకిషోర్, ఐపీవో, అరకు సబ్ డివిజన్

అధికారులు స్పందించాలి

ముంచంగిపుట్టులో సబ్‌పోస్టాఫీసు ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచి ఆ శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నాం. ఎట్టకేలకు సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు భవనాలు పరిశీలించడం మంచి పరిణామం. ఇక్కడ సబ్ పోస్టాఫీసు ఏర్పాటైతే ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే కష్టాలు ఉండవు. ముఖ్యంగా ఇంటర్, పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలు తరలింపులో నిర్వాహకుల పడే ఇబ్బందులు తొలగిపోతాయి. పోస్టల్ సేవలు మాకు మరింత అందుబాటులోకి వస్తాయి. ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో త్వరితగతిన సబ్ పోస్టాఫీసు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– మట్టం కొండపడాల్, ఉపాధ్యాయులు, ముంచంగిపుట్టు

విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు



హెచ్‌బీ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: పెదవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శనివారం 160 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్(హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత సమస్య ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి మందులు అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. హెచ్ఈ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పి అనీషా, వార్డెన్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది మంగ, సదానందం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల నమోదు



అడ్డతీగలలో వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

అడ్డతీగల: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్య కార్డులు అందజేయడానికి నమోదు ప్రక్రియను వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ ఈ కార్డులు పొందని వారిని గుర్తించి ఆ మేరకు గ్రామాల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, ఆహారపు అలవాట్లు, ఆధార్‌కార్డు తదితర వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. లబ్ధిదారుడికి నమోదైన సమాచారాన్ని చేరదీస్తున్నారు.

కొనసాగుతున్న భూదాతల దీక్ష

దుంబ్రిగుడ: మండలంలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూమి ఇచ్చినా భూదాతల దీక్ష శనివారంతో 30 రోజుకు చేరుకుంది. నేటి వరకు అధికారుల నుంచి ఎటువంటి స్పష్టత రాకపోవడంతో దీక్షను కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. మాజీ ఎంపీటీసీ రామదాసు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.పరశురామ్, భూదాతలు రామ్‌చందర్, లైకోన్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన విద్యార్థులకు అభినందన



ప్రతిభచాటిన విద్యార్థులతో హెచ్‌ఎం గోపాలకృష్ణ తదితరులు

రాజవొమ్మంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనంలో ప్రతిభ కనపరచినట్టు హెచ్‌ఎం గోపాలకృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గుంటూరుకు చెందిన క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తమ పాఠశాలకు చెంది 40 మంది పాల్గొన్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన నలుగురు బంగారు పతకాలు, ఇద్దరు వెండి పతకాలు సాధించగా, 34 మంది ప్రశంసాపత్రాలు పొందారన్నారు. వీరిని పాఠశాల డ్రాయింగ్ మాస్టారు మిరియాల కొండబాబు, ఇతర ఉపాధ్యాయులు గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అభినందించారు.

ఉపాధ్యాయుల తీరుపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

- బోధన సరిగ్గా లేదని విద్యార్థుల తల్లిదండ్రుల ధ్వజం



తహసీల్దార్ రామకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గూడెంకొత్తవీధి: సీలేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన ఆశించిన రీతిలో లేదని శనివారం తహసీల్దార్ టి.రామకృష్ణకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గూడెం కొత్తవీధి మండల కేంద్రానికి వచ్చిన ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా తహసీల్దార్‌ను కలిశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అంతంత మాత్రంగా తమ పిల్లలకు బోధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిసింది. ఈ విషయంపై ఉపాధ్యాయులను ప్రశ్నిస్తే పరిమితికి మించిన విద్యార్థులు ఉండడంతో బోధన చేయలేకపోతున్నట్టు టీచర్లు తెలియజేసినట్టు విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దార్‌కు వివరించారు. ఇక నుంచైనా బోధన సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దార్‌ను కోరారు.దీనిపై తహసీల్దార్ స్పందించి ఫిర్యాదును వెంటనే కలెక్టర్‌కు, డీఈవోకు పంపిస్తామని చెప్పారు.

జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ లాలం సీతయ్య

చింతపలి: ఉపాధి కార్డులు పొందిన గిరిజనులకు కచ్చితంగా వంద రోజుల పని కల్పించాలని ఉపాధి హామీ పథకం క్లస్టర్ ఏపీడీ లాలం సీతయ్య అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలకు చెందిన ఉపాధి హామి ఉద్యోగులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ సమావేశానికి హాజరైన ఏపీడీ సీతయ్య మాట్లాడతూ ఉపాధి హామీ వేతనదారులకు వంద రోజుల పని కల్పించడంతో పాటు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారికి అదనంగా మరో 50 రోజులు పని దినాలను కల్పించాలన్నారు. వేతదారుడికి రూ.300 వేతనం ఇవ్వాలన్నారు. గిరిజనులు మినీ గోకులాలు, కోళ్లు, మేకల షెడ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. జాబ్ కార్డుకు ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని సిబ్బంది వేగవంతం చేయాలని సూచించారు. ఏపీవోలు రాజు, రాంప్రసాద్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పీసా కమిటీలకు ముగిసిన శిక్షణ తరగతులు



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కొయ్యూరు: మండలంలోని పీసా కమిటీల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈనెల 17 నుంచి పీసా కమిటీ సభ్యులు, డ్వాక్రా సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులకు పీసా చట్టాల అమలు, నియమావళి తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ రాజ్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు తదితరులు పాల్గొని పలు సూచనలు, సలహాలిచ్చారు. మండల కేంద్రంలో జరిగిన పీసా కమిటీల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో ఎస్.కె.వి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి నెల వెలుగు కార్యాలయాల్లో జరిగే ఎంఎంఎస్ సమావేశాల్లో పాల్గొని, పీసా చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. శిక్షణ కార్యక్రమాలకు హాజరైన వారికి క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



గంగవరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

గంగవరం(అడ్డతీగల): మండల కేంద్రంలోని వై.జంక్షన్‌లో శనివారం అధికారుల బృందం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపించడంతో కోడ్ అమల్లో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు టీమ్ సభ్యులైన వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్, ఎంఈవో మల్లేశ్వరరావు, ఏఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. ప్రతి వాహనంలోని ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య పడాల్

చింతపల్లి: గిరిజన యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య పడాల్ అన్నారు. మండలంలోని అంతర్ల గ్రామంలో సోమలింగేశ్వర స్వామి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను వారు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గిరిజన యువత క్రీడల్లో రాణించడం వలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. క్రీడా పోటీల్లో యువత ఆసక్తి కనబరచాలన్నారు. అంతర్ల గ్రామానికి చెందిన కుందేరి శంకర్, నరేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో పీసా కమిటీ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి శివ సంతోష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కవడం ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణలో అల్లూరి విగ్రహం తొలగింపు



చింతపల్లిలో అల్లూరి విగ్రహాన్ని తొలగిస్తున్న సిబ్బంది

చింతపల్లి: మండల కేంద్రంలోని హనుమాన్ జంక్షన్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య పడాల్ అన్నారు. ఆయన మాట్లడతూ గతంలో ఈ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు ఆవిష్కరించారన్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా విగ్రహన్ని తొలగించాల్సి వచ్చిందన్నారు. కొత్తగా అల్లూరి విగ్రహం ఏర్పాటుతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేసి సందర్శకులకు ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేసే విధంగా జాయింట్ కలక్టర్‌ను కలసి 20 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరామన్నారు. ప్రస్తుతం ఈ విగ్రహాన్ని మండల పరిషత్ కార్యాలయం ముందు ఖాళీ స్థలంలో పది రోజులులోగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రత్యేక గుర్తింపు



నాయకులు పద్మారావు, కొండలరావులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, నేతలు

ముంచంగిపుట్టు: వైఎస్సార్‌సీపీలో కష్టపడిన వారికి ఎప్పుడు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల నియామకమైన మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంతాల కొండలరావులను జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆధ్వర్యంలో సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం మరింత కృషి చేయాలని, క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అండగా ఉండాలని, ప్రజా సమస్యలపై దృష్టి సారించి, వారికి న్యాయం జరిగేలా పని చేయాలని కోరారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మీ, నేతలు జగబంధు, మూర్తి, అప్పారావు, దేవ, తిరుపతి, సన్యాసిరావు, గౌరిశంకర్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రుణాలపై అవగాహన



గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, సిబ్బంది

దుంబ్రిగుడ: మండలంలోని కో–ఆపరేటివ్ బ్యాంకు ద్వారా తీసుకున్న వ్యవసాయ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు కో–ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు సూచించారు. మండలంలో ఆయన శనివారం పర్యటించి, గిరిరైతులకు వ్యవసాయ రుణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా గతంలో రుణాలు పొందిన రైతులు వాటిని చెల్లించి కొత్త రుణాలు పొందాలని కోరారు. వాహనం ద్వారా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటపాటలతో చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య



కొయ్యూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో విజయకుమారి

అడ్డతీగల: అడ్డతీగలలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఏఈవో పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బొమ్మల ద్వారా చిన్నారులకు పాఠాలు బోధించాలను. నాగప్రసాద్, శ్రీనివాస్, అప్పలరాజు, పావని, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీవో విజయకుమారి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు బొమ్మలు, ఆట పాటలతో బోధించడం ద్వారా వారికి సులభరీతిలో అర్థమవుతుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను విధిగా అమలుచేయాలన్నారు.